క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

దర్శి: స్థానిక కవనెంట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సీనియర్ పాస్టర్ గల్లెపోగు ఏసుదాసు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షుడు సోము దుర్గారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గాలి మూటి దేవప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తాళ్లూరు బేతేలు ప్రార్థన మందిరం సీనియర్ పాస్టర్ రెవ వై.ప్రభుదాసు క్రిస్మస్ సందేశం అందించారు. ఏసు క్రీస్తుజన్మతో ప్రజలకు శాంతి, సంతోషం, సమాధానం లభించాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కుల మతాలకు అతీతంగా జరిగే ఏకైక పండగ క్రిస్మస్ అన్నారు. పాస్టర్లు డేనియల్‌పాల్, జీఎస్ పాల్, నిరీక్షణకుమార్, సుందర్‌రావు, కోటేశ్వరరావు, వినయ్, బెజవాడ అనిల్, కోటయ్య, రమణారెడ్డి, రవిచంద్ర, 70 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరించారు.



తెగుళ్లు సోకిన మిరప పంట



ట్రాక్టర్‌తో దున్నేసిన మిరప పంట

తెగుళ్ల బారిన మిరప

- అప్పుల్లో రైతులు
- ఆదుకోని ప్రభుత్వం

పెద్దారవీడు: ఈ ఏడాది ఖరీఫ్ కాలం నుంచి మిరప రైతులు తెగుళ్ల సమస్యలతో సతమవుతూనే ఉన్నారు. మిర్చి పంటపై ప్రకృతి పగపట్టింది. ఊహించని తెగుళ్లు మిరప పంటకు ఆశించడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతున్నాయి. మండలంలో ఖరీఫ్‌లో దాదాపు 7 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారని వ్యవసాయాధికారులే చెబుతున్నారు. పంట అరంభం నుంచి కాయలు కోతలు పట్టే వరకు రక్షించుకునేందుకు రాత్రింబవళ్లు అన్నదాతలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కోటి ఆశలతో మిర్చి పంట సాగు చేస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిరప పంటను గ్రామాల్లో కొంతమంది రైతులు ట్రాక్టర్ కిల్లర్‌తో దున్నేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారంటే మిర్చి రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి పంట సాగుకు రైతులు క్రమేపీ దూరమవుతున్నారు. సాగు చేసిన మిర్చి పంటను రెండు నెలల పాటు రక్షించుకుని కాయ దశకు వచ్చే సమయంతో కాయలు కాయకపోవడంతో పంటను తొలగించుకుంటూ తమ దైన్యస్థితికి లోలోపల కుమిలిపోతున్నారు. దీంతో మండలంలో పొగాకు సాగుపై రైతులు ఎక్కువ శాతం దృష్టి పెట్టారు. మిర్చిలో వచ్చే రక రకాల తెగుళ్ల నివారణకు వివిధ రసాయన మందులు పిచికారీ చేసినా నివారణ ఫలితం కనిపించకపోవడంతో అన్నదాతలు వాపోతున్నారు. గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరుగుతున్నా మిరప పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు మందులు చేప్పే అధికారులు కనిపించడం లేదని రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిరప పంట తెగుళ్ల నివారణ గురించి అధికారులకు సమాచారం ఇచ్చిన పంట వైపు కన్నెత్తి చూసిన దాఖాలాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఎరువుల షాపుల యజమానులు చెప్పిన రసాయన మందులు పిచికారీ చేయాల్సిన దుస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాపారులు అధిక లాభాలు వచ్చే మందులను పిచికారీ చేయాలని చెబుతున్నారే తప్ప పంట తెగుళ్ల నివారణకు సంబంధించిన మందులు ఇవ్వడం లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వడ్డీలకు డబ్బులు తెచ్చి పెట్టుబడి పెట్టడమేగానీ తెగుళ్ల నివారణ కాకపోవడంతో పూత, కాయ దశలో ఉన్న మిర్చి పంటను దున్నేస్తున్నారు. అధికారులు పంటల నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉండగా తెగుళ్ల నివారణకు వ్యాపారులను అడిగి మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు విమర్శిస్తున్నారు. ఇటీవల కాలంలో పెద్దారవీడులో దాదాపు 50 ఎకరాలు మిర్చి పంటను కొంత మంది రైతులు దున్నేశారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు సూచనలు చేయాల్సిన అవసరం ఉంది.

దిక్కుతోచక మిర్చి పంటను దున్నేశా



ఖరీఫ్‌లో ఎకరాలో మిరప పంట సాగు చేశా. పంటకు కొమ్మ తెగులు, ఆకు ముడత తెగులు, వైరస్ సోకాయి. రసాయన మందులు ఎన్నిసార్లు కొట్టినా తెగుళ్లు అదుపులోకి రాలేదు. దాదాపు రూ.70 వేలు పెట్టుబడి పెట్టా. ఎరువుల వాపారులు ఇచ్చిన రకరకాల పురుగుమందులు ఎన్నిసార్లు పిచికారీ చేసిన పూత, కాయ రాలిపోతున్నాయి. ఎన్ని మందులు కొట్టినా పూత, కాయ నిలుస్తుందనే ఆశలేదు. దిక్కుతోచని పరిస్థితిలో మిరప పంటను ట్రాక్టర్‌తో దున్నేశా. ప్రత్యామ్నాయ పంటను సాగు చేస్తా. మిరప పంటకు వచ్చే తెగుళ్ల నివారణకు సంబంధిత అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. మిరప పంటకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం అదుకోవాలి.

అల్లు వెంకటరెడ్డి, రైతు, పెద్దారవీడు

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

దర్శి: కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు కల్పించాలని దర్శి నియోజకవర్గ ఏఈఆర్వో ఎం.శ్రావణ్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి కళాశాలలో 7–19 సంవత్సరాల విద్యార్థులు ఫారం–6లో ఓటరుగా నమోదు చేసేందుకు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటో, వయసు ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఈపిక్ కార్డులతో జత చేసి తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. తదుపరి విచారణ జరిపి ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో నమోదు చేస్తారని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేందుకు ఫారం–6, డబుల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లకు సంబంధించి ఫారం–7, ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఫారం–8లో ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలని సూచించారు. బూత్‌లెవల్ అధికారుల వద్ద ఉన్న ఓటరు జాబితాను ఓటర్లందరూ పరిశీలించుకోవాలని కోరారు.

ఇతరుల హక్కులకు భంగం కలిగించొద్దు

యర్రగొండపాలెం: అందరికీ ప్రాథమిక హక్కులతో పాటు కొన్ని సహజ హక్కులు ఉంటాయని, వాటిని గుర్తించి ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ప్రవర్తించాలని మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ప్రదీప్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో లెక్చరర్ కె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సీఐటీయూ కమిటీ సభ్యులు

దొనకొండ: స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సీఐటీయూ యూనియన్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న బాల కోటయ్య, కార్యదర్శి కొండా యేసుదాసు, ఉపాధ్యక్షుడిగా వైదన ఇశ్రాయేలు, కోశాధికారిగా పులుకూరి లోకయ్య, సభ్యులుగా ఎగ్గోని ఓర్పు, అరవరాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా చిరుపల్లి అంజయ్యను సభ్యులందరూ ఎన్నుకొన్నారు. కమిటీ ఏకగ్రీవానికి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు సహకరించారు.

సర్పంచ్‌లకు సమాచారం లేకుండానే రెవెన్యూ సదస్సులా?

పెద్దదోర్నాల: మండల పరిధిలోని వై.చర్లోపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే నిర్వహించారని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. గిరిజన మహిళైన సర్పంచ్ నాగుల కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పులిగుజ్జు కుమారిలకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. సదస్సులు కేవలం టీడీపీ నాయకులకు పార్టీ కార్యక్రమంగా మారాయని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ షేక్ చాంద్‌బాషా, తహసీల్దార్ శాంతితో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో పట్టాదారు పాసు పుస్తకాల కోసం 12 అర్జీలు అందినట్లు తహసీల్దార్ శాంతి తెలిపారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వీఆర్వోకు ఉందని, దీనిపై విచారణ నిర్వహిస్తామని ఆమె తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కిరణ్



దర్శి: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



వై.చర్లోపల్లిలో సర్పంచ్ లేకుండానే సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ప్రజలకు రెవెన్యూ పరంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వారి సమస్యలను అర్జీ రూపంలో ఇవ్వాలని కోరారు. గతంలోలా కాకుండా రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించి ప్రజలకు ఉపయోగపడతామన్నారు. ప్రతి ఒక్క రెవెన్యూ అధికారి ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి వారి సమస్యను క్షుణ్ణంగా విని పరిష్కరించదగినదైతే పరిష్కరించాలని, కాకుంటే ఎందుకు కాదో కారణం తెలియజేయాలని ఆదేశించారు.

పుల్లలచెరువు: గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా, నరజాములతండాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ కిరణ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించి సమస్యలు ఉంటే వాటిని గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పత్రాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వేయర్ రాములునాయక్, వీఆర్వో వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందుకుంటున్న విద్యార్థిని

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

దొనకొండ: స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న 40 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు మంగళవారం షేక్ ఫయాజ్ అందజేశారు. ఈ నెల 16 నుంచి జరుగనున్న డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు ఫయాజ్ సూచించారు. దాత ఫయాజ్‌ను గౌతమీ విద్యా సంస్థల చైర్మన్ గుండారెడ్డి, సీఈఓ నాగేంద్రబాబు, ప్రిన్సిపల్ రామయోగి, అడ్మిన్ నాని, అధ్యాపకులు అభినందించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

దొనకొండ: చీమకుర్తిలో ఈ నెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని దర్శి నియోజకవర్గం కార్యదర్శి తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. ఈ సందర్భంగా మండలం కేంద్రం దొనకొండ బస్టాండ్ సెంటర్‌లో కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు జరిగే సభను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి కర్నా హనుమయ్య, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు కుందుర్తి చిన్న నరసింహులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

కందిలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీనాయక్

కురిచేడు: కంది పంటలో ప్రస్తుతం మారుకా మచ్చల పురుగు లేదా గూడు పురుగు సమస్య వచ్చే అవకాశం ఉందని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని పమర గంగవరం పంట పొలాలను ఆయన మంగళవారం వ్యవసాయాధికారి మధుబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిలేత ఆకులను, లేదా పిందెలను, కాయలను కలిపి గూడుగా చేసుకొని కాయ అడుగు భాగాన చిన్న రంధ్రం చేసి లోపలకి వెళ్లి కాయలోని గింజలను తిని డొల్ల చేస్తుందన్నారు. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిలీ లేదా ఎసిఫేట్ గ్రాము లేదా నోవాల్యూరాన్ 1 మి.లీ, ఉధృతి ఎక్కువగా ఉంటే ఫ్లూబెండి ఏమైడ్ 0.2 మిలీ లేదా క్లోరాంట్రినిలి ప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవాలని రైతులకు సూచించారు. పంట నమోదు, పంటల బీమా గురించి వ్యవసాయాధికారి మధుబాబు వివరించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కురిచేడు: కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



పెద్దారవీడులో..

బీమా ప్రీమియం చెల్లించాలి

దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం ద్వారా ఎకరాకు రూ.525 ప్రీమియం మిరప పంట సాగు చేసిన రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీసేవా ద్వారా చెల్లించాలని ఉద్యానవన శాఖ అధికారి డి.సంధ్య తెలిపారు. ఆమె మంగళవారం మండలంలోని పడమరగంగవరంలో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. మిరప తోటల్లో కొమ్మ ఎండుతెగులు, కుచ్చు తెగులు, పూతరాలడం గమనించామన్నారు. కొమ్మ ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్న తోటల్లో తెగులు వచ్చిన కొమ్మలన్నింటినీ పూర్తిగా తీసివేయాలన్నారు. ఆ తర్వాత నేటివో లేక ఆమిస్టర్ లేక క్యాబ్రియోటాప్ మందు 2–3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. భాస్వరం ఎక్కువగా ఉండే ఎరువులను పూర్తిగా ఆపివేయాలన్నారు. పురుగుమందు కొట్టిన తర్వాత మ్యాక్స్ నాలుగు గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు పురుగుమందులు స్ప్రే చేసేటప్పుడు ఒక మందుకి ఇంకో మందుకి మధ్యలో ఐదు రోజులు సమయాన్ని ఇవ్వాలని సూచించారు. లేకుంటే తెగుళ్లు ఎక్కువైపోతాయన్నారు. పూత రాలే సమస్యకు ప్లాన్ ఆఫ్ఫిక్స్ 1 మిలీ మందు 4.5 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు.

రైతులు ఈ–పంటలో నమోదు చేసుకోవాలి

పెద్దారవీడు: రబీలో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ–పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండలంలోని ఏనుగులదిన్నెపాడు, చట్లమిట్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తున్నారని, క్షేత్ర స్థాయిలో అర్హులైన కౌలు రైతులు, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. బీమా చేసిన పంట వివరాలు ఈ పంటలో సక్రమంగా నమోదయ్యిందో లేదో రైతులు సరి చూసుకోవాలని, మండల పరిధిలో ఇప్పటి వరకు రైతులు 2607 మంది వివిధ రకాల పంటలు నమోదు చేసుకున్నారని చెప్పారు. మిరప పంటలో ఎక్కువగా పూత పురుగు (మిడ్జి ఈగ), కాయ తొలుచు పురుగులను గుర్తించారు. తల్లి పురుగు దోమలా ఉండి పసుపు గోధుమ రంగులో ఉంటాయి. పురుగు నివారణకు వేపనూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లేక ఫ్రిప్రోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయతొలుచు పురుగు నివారణకు పంటలో బంతి, ఆముదం మొక్కలను ఎర్ర పంటగా వేయాలన్నారు. లద్దె పురుగు నివారణకు ఐదు కిలోల తవుడు, 500 గ్రాముల కర్బరిల్, 500 గ్రాముల బెల్లంతో తగినంత నీటిని కలిపి చిన్న చిన్న ఉండలు తయారు చేసి పొలంలో సమానంగా చల్లితే నెలలో దాగి ఉన్న పురుగులు రాత్రిల్లో బయటకు వచ్చి తినటంతో చనిపోతాయని, స్పైనోసాడ్ 0.25 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పురుగులను నివారించవచ్చని తెలిపారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు 6 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారని, ప్రస్తుతం మొగ్గ, పూత దశలో ఉందని, ఈ సమయంలో పురుగు సోకే అవకాశాలు ఉన్నాయని, దాని నివారణకు సరైన సమయమని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని ఇండ్లచెరువు, పడమర వెంకటాపురం గ్రామాల్లో ఆయన రైతులతో కలిసి కంది పంటను పరిశీలించారు. కందిలో పచ్చ పురుగు కనిపిస్తోందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని పలు సూచనలు, సలహాలందించారు. రైతు సేవా కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలని ఏఓ సూచించారు.

యర్రగొండపాలెం: రైతులు తాము పండిస్తున్న పంటలకు ఈ నెల 15వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గంగపాలెం, నరసాయపాలెం గ్రామాల రైతులు పండిస్తున్న కంది, మినుము, మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రబీలో సాగు చేస్తున్న మినుము, శనగ, మొక్కజొన్న, మిరప పంటలకు పీఎంఎఫ్‌బీవై బీమా పథకం కింద డబ్బులను మీ సేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో ప్రీమియం చెల్లించి తమ పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ఎకరాకు మినుము రూ.103, శనగ రూ.368, మొక్కజొన్న రూ.105, జొన్న రూ.60, మిరప రూ.525 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పంటలను బీమా చెల్లించే రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది నుంచి పంట నమోదు సర్టిఫికెట్ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎల్.మాల్యాద్రిరెడ్డి, డి.ధనేశ్వర నాయక్, వీఏఏలు నాగేంద్రకుమార్, మంత్రూనాయక్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ మంగళవారం మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన చేసి జొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. రైతులకు పంటలపై సస్యరక్షణ చర్యలు వివరించారు. మిరప పంటలో కొమ్మ ఎండు తెగులును గుర్తించారు. ప్రధాన మంత్రి పసల్ భీమా పథకం, పంట నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ చైతన్యకుమార్, సంధ్యాబాయి, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



దొనకొండ: కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ



వై.పాలెం: కంది పంటను పరిశీలిస్తున్న ఏవో శేషారెడ్డి



పెద్దదోర్నాలలో..

దాతల సహకారం అభినందనీయం



ప్లేట్లు, గ్లాసులు అందుకున్న విద్యార్థులతో ప్రతినిధులు

పుల్లలచెరువు: పాఠశాల విద్యార్థులకు దాతల చేసిన సహకారం అభినందనీయమని గారపెంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రమణ అన్నారు. మండలంలోని గారపెంట ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఒంగోలుకు చెందిన మాదిగ జన సమితి ఆధ్వర్యంలో 175 మందికి ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేయడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ ఒన్ పుస్తకాలను కూడా మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా చదువుకునే విద్యార్థులకు అనేక సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థులకు ఉపయోగపడే గ్రంథాలయం పుస్తకాలు కూడా అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి దాతల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని వారు కోరారు.